క్లుప్తంగా

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మేరకు ఫర్టిలైజర్ దుకాణాల్లో ఉన్న రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువుల దుకాణాల్లో ఉన్న పురుగు మందు నమూనాను సేకరించి పరీక్షలకు పంపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫర్టిలైజర్ దుకాణాల యాజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు పంపిణీ



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని జాజితండాలో మాలోత్ అంబుర్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడికి బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉంది. దీంతో బాధిత కుటుంబానికి మంజూరైన రూ. 2లక్షల ఇన్సూరెన్స్ చెక్కును బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజిపేట మాజీ సర్పంచ్ మహ్మద్ పాషా, తండావాసులు పాల్గొన్నారు.

రసాయనాలపై జాగ్రత్త అవసరం



మాట్లాడుతున్న కాలేజీ ప్రతినిధులు

నర్సాపూర్: వాతావరణాన్ని కలుషితం చేసే రసాయనాలపై జాగ్రత్తగా ఉండాలని తెలంగాణ డ్రగ్ ఇన్స్పెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసీ కాలేజీలో(వైపర్) జరిగిన ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. వాతావరణాన్ని కలుషితం చేసే రసాయనాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. వాతావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ఇందులో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్, జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ చంద్రకళ, సీడీఎస్‌సీఓ డ్రగ్ ఇన్స్పెక్టర్ నిశాంత్, ప్రోగ్రాం కన్వీనర్ రాజశేఖర్, కోకన్వీనర్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



వివరాలు తెలుసుకుంటున్న వైద్య నిపుణులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని రెడ్డిపల్లి లో ఫ్రెండ్స్ ఆఫ్ ట్రైబల్ సొసైటీ, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్, సరోజినీ దేవి హాస్పటల్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రెడ్డిపల్లి తో పాటు పరిసర గ్రామాల ప్రజలు కంటి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులు అద్దాలు పంపిణీ చేశారు. కంటి ఆపరేషన్లు కావాల్సిన వారిని గుర్తించి వారికి ఆయా ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్ అశోక్ గౌడ్, కంటి వైద్య నిపుణులు సాయి రఘువీర్, ప్రియాంక, ముష్ రాత్, హైమద్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు రుణాలు అందేలా చూడాలి

- మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మహిళా సంఘాలకు సకాలంలో రుణాలు అందేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ సూచించారు. బుధవారం తన కార్యాలయంలో జిల్లా మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇందిర, మహిళా శక్తి యూనిట్లు, బ్యాంకు లింకేజీ, స్వయం సహాయక సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్ యాదగిరి, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. నడిచేదెలా..?

- గుంతలమయమైన ప్రధాన రహదారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



అధ్వానంగా శీలాంపల్లి ప్రధాన రహదారి

చిలప్‌చెడ్(నర్సాపూర్): అసలే అధ్వానంగా ఉన్న మండలంలోని రహదారులు ఇటీవల కురిసిన వర్షంతో చాలా దెబ్బతిన్నాయి. ఏళ్ల తరబడి రోడ్ల అభివృద్ధి, నిర్వహణను అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో జనం అవస్థలు పడుతున్నారు. చిలప్‌చెడ్ మండలంగా ఏర్పడి ఏనిమిదేళ్లు అవుతున్నా.. మండలంలోని ఆయా గ్రామాల రహదారులు అధ్వానంగా ఉన్నాయి. మండలంలో శీలాంపల్లి గేటు నుంచి అంతారం గేటు వరకు హైదరాబాద్ వెళ్లే ప్రధాన రహదారి సుమారు 9 కిలోమీటర్లు ఉంటుంది. ఈ రోడ్డు పనులకు రూ. 6.70 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారు ఉన్న పాత బీటీరోడ్డును పూర్తిగా తవ్వించి, శీలాంపల్లి వరకు మాత్రమే రోడ్డు వేయించి, మరో 900 మీటర్ల రోడ్డు పనులు అలాగే వదిలేశాడు. దాంతో ఆ రోడ్డులో ప్రయాణించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫైజాబాద్ గేటు నుంచి అజ్జమర్రి గ్రామం వరకు ఉన్న బీటీరోడ్డు పూర్తిగా గుంతలమయమైంది. చాముండేశ్వరి ఆలయం నుంచి ఎనగండ్ల వెళ్లే రోడ్డు కూడా పూర్తిగా పాడైపోయింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అవస్థలు పడుతున్నాం



శీలాంపల్లి రోడ్డుపై ప్రయాణించాలంటే నరకప్రాయంగా ఉంటుంది. రాత్రి సమయంలో ఈ రహదారిపై ప్రయాణం మరీ ఇబ్బందికరంగా ఉంది. సుమారుగా 900 మీటర్ల ఉన్న ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. ఉన్న పాత రోడ్డును తవ్వించి, కొత్త రోడ్డు వేయకపోవడంతో చాలా అవస్థలు పడుతున్నాం.

– రాజేందర్‌రెడ్డి, శీలాంపల్లి గ్రామస్తుడు

రోడ్డు బాగు చేయాలి



ఫైజాబాద్ గేటు నుంచి అజ్జమర్రి వరకు ఉన్న బీటీ రోడ్డు మధ్యలో గుంతలు ఏర్పాడ్డాయి. అత్యవసర పనుల కోసం ఈ గ్రామాలకు వెళ్లాలంటే సమయానికి ఆటోలు కూడా రావడం లేదు. మరమ్మతులకు నోచుకోని ఈ రహదారులను అధికారులు, పాలకులు బాగు చేసి, వాహనదారులకు ప్రయాణం సులభతరం చేసేందుకు కృషి చేయాలి.

– సురేందర్‌రెడ్డి, అజ్జమర్రి

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



నిజాంపేటలో గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



కౌడిపల్లి పీహెచ్‌సీలో కార్మికులకు చేస్తున్న వైద్యపరీక్షలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

- ఎంపీడీఓ శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): స్వచ్ఛభారత్‌లో జీపీ కార్మికుల సేవలు ఎంతో గొప్పవని, వారు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛతహీ సేవలో భాగంగా బుధవారం పంచాయతీ కార్మికులకు పీహెచ్‌సీతో పాటు ఆయా గ్రామాల్లో పరిధిలోని సబ్‌సెంటర్లలో వైద్యపరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో డా. ప్రవీణ్‌కుమార్, ఎంపీఓ కలీముల్ల, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, వైద్య సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

మనోహరాబాద్‌లో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు వికాస్, జ్యోత్స్నదేవి కార్మికులకు వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, వైద్య బృందం పాల్గొన్నారు.

నాగులపల్లిలో ..



తూప్రాన్: నాగులపల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తూప్రాన్: మండలంలోని నాగులపల్లిలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషాద్రి, ఎంపీవో సతీష్, పల్లె దవాఖాన డాక్టర్ సునీత, పంచాయతీ కార్యదర్శులు సంతోష్ కుమార్, సురేష్, ఏఎన్ఎం జ్యోతిలక్ష్మి, ఆశ కార్యకర్త రేణుక, పారిశుద్ధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని చల్మెడ, కల్వకుంట, నస్కల్, నిజాంపేట గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవలో భాగంగా బుధవారం గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి మందులు, సబ్బులు, గ్లౌజ్‌లు, నూనె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజిరెడ్డి, ఎంపీఓ ప్రవీణ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరిప్రియ, పంచాయతీ కార్యదర్శులు, ఆశవర్కర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించండి

వెల్దుర్తి(తూప్రాన్): అరవై ఏళ్ల వయస్సు పైబడిన వారికి కారుణ్య నియామకం కింద గత ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని హామీఇచ్చిన నేపథ్యంలో నియామకాలు చేపట్టాలని వీఆర్ఏల వారసులు తహసీల్దార్ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. జీఓ 81, 85 ప్రకారం వీఆర్ఏల కుటుంబ సభ్యులకు ఎలాంటి షరతులు లేకుండా ఉద్యోగం కల్పించాలన్నారు. మండలంలో 61 సంవత్సరాల పైబడిన వారసులు 15 మంది ఉన్నారని, అందరికీ ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. కార్యక్రమంలో పోచయ్య, కొండల్, రమేశ్, శేఖర్, రేణుక, శ్రీకాంత్, శంకర్‌బాబు పాల్గొన్నారు.

గోదాంలో నామమాత్రపు తనిఖీలు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఆరెగూడెం గ్రామ శివారులోని ఎస్‌వీఆర్ ఇండియన్ గ్యాస్ గోదాంను బుధవారం తహసీల్దార్ కృష్ణ, గిర్దావర్ జయభారత్‌రెడ్డి సందర్శించారు. గోదాంలో నిల్వ ఉన్న సిలిండర్లను తూకం వేశారు. మండలంలోని దామరంచ గ్రామంలో గ్యాస్ సరఫరా చేసే సిబ్బంది రీ ఫిల్లింగ్ చేస్తుండగా.. వినియోగదారులు పట్టుకున్న నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. సిలిండర్ పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని వచ్చిన ఆరోపణలపై సివిల్ సప్లై అధికారులను పూర్తిస్థాయిలో విచారించాలని సూచించామన్నారు. ఇదిలా ఉండగా అక్రమంగా రీ ఫిల్లింగ్ చేస్తూ వినియోగదారులను నిండాముంచుతున్న వైనంపై అధికారులు దామరంచ గ్రామంలో క్షేత్రస్థాయిలో విచారణ చేయాల్సి ఉంది. కానీ తూతూమంత్రంగా గోదాంలో తనిఖీ చేపట్టడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయంలో ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో ఎంఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



కౌడిపల్లి(నర్సాపూర్): నూతన ఎంఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎంఈఓల నియామకం

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎంఈఓలు బాధ్యతలు స్వీకరించారు. టేక్మాల్ ఎంఈఓగా సుజాత, పాపన్నపేట ఎంఈఓగా ప్రతాప్‌రెడ్డి, కౌడిపల్లి ఎంఈఓగా బాలరాజు, చిన్నశంకరంపేట ఎంఈఓగా పుష్పవేణి, మనోహరాబాద్ ఎంఈఓగా మల్లేశం, చేగుంట ఎంఈఓగా నీరజ, అల్లాదుర్గం ఎంఈఓగా ధనుంజయ్య, పెద్దశంకరంపేట మండల విద్యాధికారిగా వెంకటేశం, కొల్చారం ఎంఈఓగా సత్యనారాయణరావు, నిజాంపేట ఎంఈఓగా యాదగిరి, రేగోడ్ ఎంఈఓగా గురునాథ్ బాధ్యతలు చేపట్టారు.

అలుగు పారుతున్న కూకుట్లపల్లి చెరువు



కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కూకుట్లపల్లి పెద్ద చెరువు రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో బుధవారం అలుగు పారింది. ఇటీవల కురిసిన వర్షాలతో చెరువు నిండగా అలుగు పారలేదు. రెండు రోజులుగా వర్షం కురవడంతో అలుగు పారుతోంది. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం



చిన్నశంకరంపేట(మెదక్): అంగన్‌వాడీలో చిన్నారుల బరువును పరిశీలిస్తున్న అధికారులు

వెల్దుర్తి(తూప్రాన్): సంపూర్ణ ఆరోగ్యం కోసం పోషకాహారం తినాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణంతో పాటు మాతా శిశు సంరక్షణ కోసం ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం పోషణ మాసం నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగానే వెల్దుర్తి అంగన్‌వాడీ కేంద్రం-4, కోమటిపల్లి-2లో పోషణ మాసోత్సవం నిర్వహించి సామూహిక సీమంతాలు నిర్వహించారు. పోషకాహారలోపం వలన కలిగే అనర్థాలను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గౌసియా, సావిత్రి ఆశవర్కర్, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారుల బరువు తూకం

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కొర్విపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారుల బరువు తూకం వేశారు. బరువు తక్కువున్న చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా తల్లులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బరువు తక్కువగా ఉండడంతో చిన్నారులకు వచ్చే ఆరోగ్య సమస్యలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ అంజమ్మ, మెడికల్ ఆఫీసర్ కుమారి, ఏఎన్ఎం ప్రియాంక, అంగన్‌వాడీ టీచర్ మంగమ్మ పాల్గొన్నారు.

ప్రతిరోజూ క్లాస్‌లు మిస్ అవుతున్నాం



ఖాజాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

- బస్సు కోసం విద్యార్థుల రాస్తారోకో

చిన్నశంకరంపేట(మెదక్): పాఠశాల సమయానికి బస్సులు రాకపోవడంతో ప్రతిరోజూ క్లాస్‌లు మిస్ అవుతున్నామని మండలంలోని ఖాజాపూర్ రహదారిపై విద్యార్థులు రాస్తారోకో చేశారు. బుధవారం రామాయంపేట – చిన్నశంకరంపేట రహదారిపై ఖాజాపూర్ చౌరస్తా వద్ద బస్సుకు అడ్డంగా నిలబడి విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతిరోజూ ప్రార్థన సమయంతో పాటు మొదటి క్లాస్‌ను మిస్ అవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల సమయం ఉదయం 9 వరకు చిన్నశంకరంపేటకు బస్సు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్టీసీ అధికారులు స్పందించి, తమకు న్యాయం చేయాలని అన్నారు.

పాఠశాలల సమస్యలు పరిష్కరించాలి



నర్సాపూర్ ఎంఈఓ తారాసింగ్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): విరామ సమయంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

నర్సాపూర్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు అన్నారు. బుధవారం పట్టణంలో మండల కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఆ మేరకు భోజన విరామసమయంలో ఎస్‌జీటీ ఫోరం మండలాధ్యక్షుడు గణేశ్, ప్రధాన కార్యదర్శి సంతోష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. జీఓ నంబర్ 25 ప్రకారం.. ప్రతీ ప్రాథమిక పాఠశాల తరగతికి ఒక ఉపాధ్యాయున్ని నియమించాలని కోరారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం మండల విద్యాధికారిగా నియమితులైన తారాసింగ్‌ను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, సామ్యానాయక్, వీరేశం, లాలు, భీమ్లా, పంతులు, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జీఓ 25ను వెంటనే విరమించాలి

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్యను తగ్గించేందుకు తీసుకొచ్చిన జీఓ నెంబర్ 25ను వెంటనే రద్దు చేయాలని మండల కేంద్రంలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు శివప్రసాద్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతీ పాఠశాలకు ఒక హెచ్ఎం, ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం తెచ్చిన ఉపాధ్యాయులు సర్దుబాటు జీఓపై ఉపాధ్యాయ సంఘం నాయకులు చిలప్‌చెడ్‌లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశం సందర్భంగా భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటకృష్ణ, సత్యనారాయణ, సునీల్, మహేశ్, భిక్షపతి, లావణ్య, ఉమారాణి, ఉషశ్రీతో పాటు తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా గ్రామసభలు



నర్సాపూర్ మండలంలోని నత్నాయ్యపల్లి గ్రామసభకు హాజరుకాని ప్రత్యేక అధికారులు

నర్సాపూర్ రూరల్: స్వచ్ఛత హీ సేవలో భాగంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు తూతు మంత్రంగా గ్రామసభలు నిర్వహించి, చేతులు దులుపుకున్నారు. బుధవారం జరిగిన ఈ సభలకు ప్రత్యేక అధికారులు హాజరు కాలేదు. 15 రోజుల పాటు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో గ్రామ కార్యదర్శులు, గ్రామస్థాయి అధికారులు కలిసి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. కానీ గ్రామస్థాయిలో ప్రత్యేక అధికారులతో పాటు గ్రామ కార్యదర్శులు, ఏఎన్ఎం, ఆశ, అంగన్‌వాడీ, ఫీల్డ్ అసిస్టెంట్, ఐకేపీ సిబ్బంది సమయపాలన పాటించకుండా రికార్డుల్లో రాసి పరిమితం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని నత్నాయ్యపల్లిలో జరిగిన గ్రామసభకు పట్టుమని పదిమంది కూడా గ్రామస్తులు హాజరు కాలేదు. ఈ విషయమై ఎంపీఓ వైద్య శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. మండలంలో 34 గ్రామ పంచాయతీలుండగా ఎంపీడీఓకు 14 గ్రామాలు, ఎంపిఓకు 14 గ్రామాలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఏ, ఇరిగేషన్ ఏఈ, పీఆర్ ఏఈ రెండు గ్రామాల చొప్పున ప్రత్యేక అధికారులుగా నియమించామన్నారు. దీంతో కొంత సిబ్బంది కొరత ఉందని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **పండిత్ దీన్ దయాళ్‌కు ఘన నివాళి**



టేక్మాల్(మెదక్): జనతా పార్టీ వ్యవస్థాపకుడు పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతిని నిర్వహించారు. బుధవారం ఈ సందర్భంగా టేక్మాల్ బీజేపీ కార్యాలయంలో ఉపాధ్యక్షుడు రాములు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్లుపేట రాజు, మండల ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, బూత్ అధ్యక్షుడు వెంకటేష్ పాల్గొన్నారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం(మెదక్):మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో పండిత్ దీన్ దయాళ్ జయంతిని నిర్వహించారు. బీజేపీ జిల్లా నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

◆ **పాఠశాలకు సామగ్రి పంపిణీ**

చిలప్‌చెడ్(నర్సాపూర్): విద్యార్థులు సౌకర్యం కోసం చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలకు సామగ్రిని చౌటకూరి బ్రదర్స్ గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి పంపిణీ చేశారు. బుధవారం చంద్రశేఖర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా చిలప్‌చెడ్ ఉన్నత పాఠశాలకు అవసరమైన వివిధ సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వేదశ్రీ వారిని సన్మానించారు.

◆ **కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే**

తూప్రాన్: పట్టణంలోని నలంద జూనియర్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు ఘనంగా స్వాగతం పలికారు. లక్ష్మీగార్డెన్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలను బుధవారం జరుపుకొన్నారు కార్యక్రమంలో నలంద డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రసాద్, ఇన్‌చార్జి రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **శానిటేషన్ కిట్స్ పంపిణీ**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ఎంపీడీఓ ఆనంద్, తహసీల్దార్ ముసాద్దిక్ శానిటేషన్ కిట్స్ పంపిణీ చేశారు. బుధవారం పంచాయతీ కార్మికులకు హెల్త్ క్యాంప్ నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ప్రతిమ పాల్గొన్నారు.

◆ **టీపీటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక**

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రం మాసాయిపేటలోని ఉన్నత పాఠశాలలో బుధవారం టీపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శిగా స్వప్నశ్రీ, ఉపాధ్యక్షులుగా రాజమణి, శ్యామ్‌సుందర్, కార్యదర్శిగా సత్యానందం, హరికిషన్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

◆ **చీరల పంపిణీ**

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు మాజీ వార్డు సభ్యుడు ప్రభాకర్‌గౌడ్ చీరలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దసరా పండుగను పురస్కరించుకొని ఏటా పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేస్తానని తెలిపారు.

◆ **కుట్టు మిషన్ల పంపిణీ**

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ బైతుల్‌మాల్ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద మహిళలకు కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో బైతుల్ మాల్ బాధ్యులు మహమ్మద్ ఆరిఫ్ హుస్సేన్, మహమ్మద్ అబిద్ అలీ ఖాద్రీ, మహ్మద్ రియాజ్ ఉదిన్, సయ్యద్ గఫార్ అహ్మద్, మహమ్మద్ తాహిర్, ముహమ్మద్ అథర్, డాక్టర్ షుజాత్ అలీ సూఫీ, మీర్జా హఫీజ్ బేగ్, ముహమ్మద్ ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

◆ **పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ నిరంతర కృషి చేస్తుందని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణ అన్నారు. బుధవారం చిలప్‌చెడ్ ప్రాథమిక పాఠశాలలో ఆయన నూతన పీఆర్‌టీయూ మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. 2024–26 పీఆర్‌టీయూ అధ్యక్షుడిగా సునీల్, ప్రధాన కార్యదర్శిగా బుచ్చిరాములు, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వాణిదేవి, కార్యదర్శిగా నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు మురళి, శర్వన్, నాగేందర్ రెడ్డి, ఎన్నికల అధికారులుగా ప్రసన్నకుమార్, రమేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.